క్లుప్తంగా

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

శ్రీకాళహస్తి: భారీ వర్షాలు పడతాయన్న హెచ్చరికల నేపథ్యంలో తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి డివిజన్‌లో సోమవారం నుంచి 17వ తేదీ వరకు భారీ వర్షాల నేపథ్యంలో పలు చోట్ల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారని, ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 9966524952కు సమాచారం ఇవ్వాలన్నారు.

పెద్దకనపర్తిలో ట్రెంచ్ ఏర్పాటు


ట్రెంచ్ కొట్టిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం పెద్దకనపర్తి గ్రామం వద్ద స్వర్ణముఖి నదిలో అక్రమ ఇసుక తవ్వకాలు చేపట్టకుండా శనివారం రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ట్రెంచ్ ఏర్పాటు చేశారు. పెద్దకనపర్తి వద్ద ఉన్న స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుక తోడేస్తున్నారన్న సమాచారం సాక్షి దినపత్రికల్లో రావడంతో శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి స్పందించారు. పెద్దకనపర్తి వద్ద ఇసుక తవ్వకాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని తొట్టంబేడు తహసీల్దారు మధుసూదన్‌రావును ఆదేశించారు. ఆ మేరకు ఆయన రెవెన్యూ, పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకుని దారికి అడ్డంగా ట్రెంచ్ కొట్టి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అనుమతులు లేకుండా స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు మధుసూదన్‌రావు, ఎస్‌ఐ ఈశ్వరయ్య హెచ్చరించారు. వీఆర్వో కృష్ణయ్య, సీనియర్ అసిస్టెంట్ నారాయణ, తలారి అంకయ్య, శివ పాల్గొన్నారు.

ఘనంగా పడిపూజ

నాగలాపురం: పిచ్చాటూరు మండలంలోని ఓబులరాజుకండ్రిగలో గురుస్వామి నాగేంద్రబాబు ఆధ్వర్యంలో ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు స్వామివారిని స్మరిస్తూ భజనలు చేశారు. అనంతరం అయ్యప్ప, గణపతి స్వామి చిత్రపటాలకు ప్రత్యేక అలంకరణ చేసి మహా పడిపూజ నిర్వహించి 18 పడిమెట్లకు కర్పూర హారతులు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

సత్యవేడు విద్యార్థుల ప్రతిభ


విజేతలతో కరాటే మాస్టర్

సత్యవేడు: తమిళనాడులోని ఆరణిలో ఆదివారం జరిగిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ ద్వితీయ రాష్ట్రస్థాయి 'ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్-24' పోటీలో సత్యవేడు విద్యార్థులు కటా, కుమితే కరాటే పోటీల్లో సత్యవేడు విద్యార్థులు ప్రతిభ చూపారు. అందులో జి.బి లక్షిత, నజియాభాను, రిత్విక్ యాదవ్ ప్రథమ స్థానంలో నిలవగా, కే.పవిత్ర, యువశ్రీ ద్వితీయ స్థానం సాధించారు. అన్నింటా ప్రతిభ చూపిన విద్యార్థు లు ట్రోఫీని కైవసం చేసుకున్నారు. అండర్-5, అండర్-10 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన రిత్విక్ యాదవ్ సత్యవేడు దళవాయి అగ్రహారం ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. మాస్టర్ భువనేష్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

కల్యాణం.. కమనీయం


శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

వరదయ్యపాళెం: మండల కేంద్రంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాసుడికి పెరటాసి మాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని కల్యాణోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి స్థానిక వ్యాపారి కేశవయ్య దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మహిళలకు తాళిబొట్లను అందించారు. ఆలయ ధర్మకర్త వేలా సుందరం, మాజీ సర్పంచ్ చిన్నా, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అరుణా నదిలో వ్యక్తి గల్లంతు

నాగలాపురం: మండలంలోని కారణి గ్రామానికి చెందిన కృష్ణయ్య (75) అనే వ్యక్తి శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే అంత్యక్రియలు పూర్తి చేయాలంటే గ్రామంలో ఎవరైనా అరుణా నది దాటి వెళ్లాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మృతుడు కృష్ణయ్య బంధువైన వడివేలు(35) అనే వ్యక్తి అంత్యక్రియల్లో పాల్గొని తిరిగి వచ్చే క్రమంలో నదిని దాటుతుండగా గల్లంతయ్యాడు. దీంతో బంధుమిత్రులు నాగలాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సునీల్ కుమార్ వెంటనే సత్యవేడు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా, వారు గాలింపు చర్యలు చేపట్టారు. అప్పటికే చీకటి పడడంతో గల్లంతైన వ్యక్తి ఆచూకీ తెలియడం లేదు. సోమవారం గాలింపు చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.


మడుగులను తలపిస్తున్న నాగలాపురం-చిన్నపాండూరు ప్రధాన రోడ్డు మార్గం

అడుగుకో గుంత..
తప్పని వెత

గ్రామీణ ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. వర్షం వస్తే రోడ్లు బురదమడులను తలపిస్తున్నాయి. గుంతలమయంగా మారిన రోడ్లపై వాహనదారులే వెళ్లలేకపోతున్నారు. ఇక కాలినడకన వెళ్లే వారి పరిస్థితి ఏంటో చెప్పాల్సిన పని లేదు. వరదయ్యపాళెం మండలంలోని చమ్మత్తకండ్రిగ సమీపంలో ఉన్న క్వారీల నుంచి నిత్యం వందలాది టిప్పర్ లారీల ద్వారా అధిక లోడు వేసుకుని కంకర తరలిస్తున్నారు. ఈ కారణంగా గ్రామీణ రోడ్లన్నీ గుంతలమయంగా మారుతున్నాయి. అడిగే వారు లేకపోవడంతో ప్రజలకు వెత మిగులుతోంది.

- వరదయ్యపాళెంలో దారుణంగా గ్రామీణ రోడ్లు
- వర్షం వస్తే పల్లె ప్రయాణం నరకమే..!
- అధ్వానంగా చిన్నపాండూరు-నాగలాపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు
- 28 కి.మీ. మేర పూర్తిగా దెబ్బతిన్న వైనం
- కంకర తరలించే లారీల వల్ల రూపురేఖలు కోల్పోతున్న రోడ్లు
- పట్టించుకోని పాలకులు

వరదయ్యపాళెం: గత ప్రభుత్వం గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేసింది. ఏళ్ల తరబడి రోడ్లకు నోచుకోని ఎన్నో గ్రామాలకు సైతం తారు, బీటీ, సీసీ రోడ్లు వేసి ప్రజలకు రవాణా సౌకర్యాన్ని కల్పించింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లెల సంగతి మరిచిపోయింది. ఇచ్చిన హామీలు ఎలాగూ ఇవ్వలేదు. కనీసం రోడ్లు అయినా బాగు చేయండయ్యా అని దీనంగా అడుగుతున్నారు వరదయ్యపాళెం మండలంలోని చిన్న పాండూరు-నాగలాపురం రోడ్డు మార్గంలో వెళ్లే ప్రజలు. ఈ రోడ్డులో ప్రయాణం అంటే వాహనదారులు సాహసం చేయాల్సి వస్తోంది. సుమారు 28 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో అడుగుకోగుంత ఉంది. అటు వాహనాలు ఇటు స్థానిక ప్రజల ఒళ్లు గుల్లవుతుందంటూ ఆవేదన చెందుతున్నారు. వందలాది వాహనాలు ప్రయాణించే ఈ మార్గం రోడ్డు గురించి పాలకులకు ఏమాత్రం పట్టడం లేదు. దీంతో రోజువారీ ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు పాట్లు అన్నీఇన్నీ కావు. వర్షాకాలం వస్తే మడుగులను తలపించే విధంగా రోడ్డుపై ఉన్న గుంతలు వర్షపునీటితో నిండి ఆ గంతలలో వాహనాలను దించి ఇరుక్కుపోతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు రోడ్డు అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

10 కి.మీ మేర నరక ప్రయాణం..

నాగలాపురం రోడ్డు మార్గంలో చిన్న పాండూరు నుంచి చమ్మత్తకండ్రిగ వరకు 10 కి.మీ.ల మేర డబుల్ రోడ్డు ఉంది. ఆ మార్గం పూర్తిగా మడుగులను తలపించే విధంగా గుంతలు ఉన్నాయి. ఆ గుంతల్లో ద్విచక్ర వాహనదారులు, కార్లు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాక తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

ఈ పరిస్థితులకు కారణం ఏంటంటే..!

ప్రధానంగా చమ్మత్తకండ్రిగ సమీపంలో మూడు కంకర క్వారీలు ఉన్నాయి. ఈ క్వారీల నుంచి నిత్యం వందలాది టిప్పర్ లారీలు తమిళనాడుకు అధిక బరువు కలిగిన లోడింగ్‌లతో వెళ్తాయి. ఈ కారణంగా రోడ్లలో పెద్దఎత్తున గుంతలు ఏర్పడుతున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో ఉండిపోతున్నారు. దీంతో రోడ్లు వేసినా, కంకర లారీల కారణంగా కొద్దిరోజులకే పూర్తిగా ధ్వంసం అవుతున్నాయి.

రూపురేఖలే కోల్పోయిన రోడ్డు..

చమ్మత్తకండ్రిగ నుంచి నాగలాపురం వరకు సింగిల్ రోడ్డు ఉండేది. అయితే ఆ రోడ్డు గత కొద్దికాలంగా పూర్తిగా ధ్వంసం కావడంతో తారురోడ్డు రూపురేఖలు మారిపోయాయి. 18 కి.మీల దూరం మట్టి రోడ్డులా మారింది. ఇక వర్షాలు వస్తే ఆ రోడ్డు బురదమయం అవుతోంది. ఆ ప్రాంత ప్రజలు వర్షాల సమయంలో ఈ రోడ్డులో వెళ్లడానికి పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. సింగిల్ రోడ్డుగా ఉన్న ప్రాంతాన్ని డబుల్ రోడ్డుగా మార్చుతామని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినా.. ఇప్పటి వరకు స్థానిక ప్రజాప్రతినిధి దాని గురించి ఆలోచించడం లేదు. సుమారు 15 గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర అవస్థ పడుతున్నారు.


భారీ టన్నేజీతో వస్తున్న టిప్పర్ లారీలు


నాగలాపురం మార్గంలో వెంకటాపురం వద్ద ఛిద్రమైన రోడ్డు

వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి..



చిన్న పాండూరు-నాగలాపురం రోడ్డు మార్గంలో వాహనదారులు సైతం వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా అడుగుకో గుంత ఏర్పడి వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు మార్గం మరమ్మతుల గురించి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా వాహనదారుల ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించాలి.

– మురళి రెడ్డి, కాపుకండ్రిగ

ప్రభుత్వం పట్టించుకోవాలి



ఇంతటి అధ్వానంగా ఉన్న చిన్నపాండూరు-నాగలాపురం రోడ్డు అభివృద్ధి గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకోవాలి. గుంతలమయంగా ఉన్న రోడ్డుకు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నాం. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డు మార్గం గురించి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అంతేకాక అధిక లోడుతో ఉన్న లారీలను నియంత్రించాలి. వాహనాలను నియంత్రిస్తే గానీ రోడ్డు మరమ్మతులకు గురవడం ఆగదు. దీనిపై ప్రభుత్వ అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలి.

– గణపతి, పాదిరికుప్పం

వేడుకగా కుంభాభిషేకం


అమ్మవారిని దర్శించుకుంటున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని అమ్మపాలెం గ్రామంలో వెలసిన మాతమ్మ తల్లి ఆలయంలో కుంభాభిషేకం ఆదివారం వేడుకగా జరిగింది. వేద పండితులు ఆలయంలో హోమ పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో మాతమ్మ తల్లి ముగ్గు వేశారు. భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కుంభాభిషేకంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈశ్వర్ రెడ్డి, రఘు కేశవ్ రెడ్డి, ఉన్నం వాసు నాయుడు, కంట ఉదయ్ కుమార్, శ్రీవారి సురేష్, కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడం అడ్డగింత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం నాలుగో గేటు సమీపంలో అక్రమ నిర్మాణం చేపడుతున్న వారిని శనివారం పురపాలకసంఘ అధికారులు అడ్డుకున్నారు. సుబ్రహ్మణ్యంరెడ్డి అనే వ్యక్తి నాలుగో గేటు ఎదురుగా సన్నిధివీధిలో స్థలాన్ని ఆక్రమించి తాత్కాలిక దుకాణాలను ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో మొదటి అంతస్తు నిర్మించేందుకు సెంట్రింగ్ పనులు చేపట్టగా.. స్థానికుల సమాచారం ఇవ్వడంతో శనివారం పురపాలకసంఘ అధికారులు వచ్చి అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఆక్రమణదారుడు వెంటనే శ్రీకాళహస్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ముత్యాల పార్థసారథి, అతని అనుచరులకు సమాచారం అందించాడు. వారు అక్కడికి చేరుకుని మున్సిపల్ అధికారులను దుర్భాషలాడారు. అయితే ఇదే భవన నిర్మాణాన్ని గతంలో కూడా అధికారులు అడ్డుకోగా అప్పుడు కూడా ముత్యాల పార్థసారథి దుర్భాషలాడిన వీడియో అప్పట్లో వైరల్ అయింది.

అధైర్య పడవద్దు.. అండగా ఉంటా

- కూటమి నేతలకు ప్రజలే బుద్ధి చెబుతారు
- కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు భరోసా


పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: అధికార పార్టీ దాడులు, అక్రమ కేసులకు అధైర్య పడకండి.. అన్నిటా ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా అని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పార్టీ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఆదివారం ఆయన మండలంలోని పోలి గ్రామంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. అంతకుముందు గ్రామంలోని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు పుల్లూరు అశోక్ రెడ్డి కుమారుడి కేశఖండన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వాంపల్లిలోని దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నాలుగు నెలలుగా వేధిస్తున్నారన్నా..

పోలం గ్రామంలో జరిగిన సమావేశంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు గత నాలుగు నెలలుగా స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అనుచరులు తమపై 307 ఎస్సీ, ఎస్టీ వంటి అక్రమ కేసులు పెడుతూ గ్రామాల్లో ఉండలేని పరిస్థితులు తీసుకు వస్తున్నారని బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీకి ఓట్లు వేయలేదన్న కక్షతో పోలీసులను అడ్డం పెట్టుకుని తమను వేధిస్తున్నారని, ఏ తప్పు చేయకపోయినా అక్రమ కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఎంపేడు ఈశ్వరయ్య కాలనీలో టీడీపీ నాయకుల అరాచకాలకు భయపడి 25 కుటుంబాలు ఇప్పటికీ బయట ప్రాంతాలకు వెళ్లి బతుకుతున్నారని వాపోయారు. గ్రామాల్లో అధికార పార్టీ నాయకుల వేధింపుల గురించి వివరించారు.

ఎవరూ భయపడొద్దు.. నేనున్నా..

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ తనకు తోడుగా నిలిచిన కార్యకర్తలందరికీ ధన్యవాదాలు అని అన్నారు. ఏ ఒక్కరూ అధైర్య పడవద్దని, ప్రతి కార్యకర్తకు తాను అండగా నిలుస్తానన్నారు. ఎన్నడూ లేనివిధంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా దాడులు, అక్రమ కేసులు, సొంత ఆస్తుల నష్టానికి ఒడిగడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. భయానక వాతావరణాన్ని సృష్టించి మూడు నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్నారని అన్నారు. అయితే కొంత కాలం అందరం సంయమనం పాటించి దాడులను ఓర్చుకుని భరించామన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే చూస్తూ ఊరుకోమని, ప్రజలే ఎదురుదాడికి దిగి వారికి బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే ఉన్నాయన్నారు. అధికారులు, పోలీసులు కూడా ఏకపక్షంగా వ్యవహరించి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోమని, ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తొట్టంబేడు మండల అధ్యక్షుడు ఉన్నం వాసునాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుపాను హెచ్చరికలపై సమీక్ష


సత్యవేడు: మాట్లాడుతున్న తహసీల్దారు టీవీ సుబ్రమణ్యం

సత్యవేడు: వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు నాలుగు రోజులు మండలంలో అధికారులు, సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు టీవీ సుబ్రమణ్యం కోరారు. ఆదివారం జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. 14, 15, 16, 17 తేదీల్లో తీవ్ర తుపాను ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిందన్నారు. మండల అధికారులు, సచివాలయ సిబ్బంది సెలవులు పెట్టకుండా నాలుగు రోజుల పాటు అందుబాటులో ఉండాలన్నారు. ఇరిగేషన్, పంచాయతీ సెక్రటరీలు చెరువుల పటిష్టతను గుర్తించి సమాచారం ఇవ్వాలని కోరారు. లోతట్టు ప్రాంతాల్లో ముంపునకు గురయ్యే ప్రాంతాలు ఉంటే ముందుగా ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించాలని సూచించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, డాక్టర్ గుణశేఖర్, ఏఈ ఇబ్రహీంఖాన్, తెలుగు గంగ జేఈలు మహేష్‌బాబు, వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ సురేష్, సత్యవేడు పంచాయతీ సెక్రటరీ మునిరవికుమార్, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగురోజుల అప్రమత్తంగా ఉండండి

బుచ్చినాయుడుకండ్రిగ: ఐఎండీ సూచనల ప్రకారం ఆగ్నేయ బంగాళాఖాతం పక్కనే ఉన్న హిందూ మహాసముద్రం వరకు ఆవర్తనం విస్తరించి ఉండడంతో ఏర్పడిన తుపాన్ కారణంగా నాలుగు రోజుల పాటు మోస్తరు వర్షాలు పడతాయని అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు సుబ్రమణ్యం అధికారులను ఆదేశించారు. ఆయన ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంలో తుపాన్ ప్రభావంపై తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ ఏడీఏ మునిరాజా, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఎంఈఓ మునిసుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: వాతావరణ శాఖ హెచ్చరిక మేరకు ఈ నెల 14, 15 తేదీల్లో భారీ వర్షాలు పడనున్న నేపథ్యంలో అన్నీ శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అప్రమత్తంగా వ్యవహరించాలని తహసీల్దార్ రాజశేఖర్ సూచించారు. ఈ మేరకు ఆయన ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ప్రసాద్, ఎస్‌ఐ మల్లికార్జున్, ఈఓపీఆర్డీ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు హాజరయ్యారు.

చేతివృత్తులతో ఆర్థికాభివృద్ధి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శోభన్‌బాబు

ఏర్పేడు: చేతివృత్తులతోనే మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శోభన్ బాబు అన్నారు. శనివారం మండలంలోని కోబాక సచివాలయంలో కలంకారీ మహిళలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలంకారీపై 60 మంది మహిళలకు శిక్షణ అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు వెలుగు సంఘాల ద్వారా రుణాలు పంపిణీ చేస్తామన్నారు. ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని సిర్ఫ్స్ సంస్థ ద్వారా ఇలాంటి శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కలంకారీ కళలకు మంచి డిమాండ్ ఉందన్నారు. కలంకారీ విద్యను నైపుణ్యంగా నేర్చుకుని, మార్కెటింగ్ పట్ల అవగాహన పెంచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. శిక్షణానంతరం ధృవపత్రాలతో పాటు బ్యాంకు లింకేజీని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వెలుగు సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజరు నాగేశ్వరరావు, సిర్ఫ్స్ సంస్థ కార్యదర్శి హేమశేఖర్, గ్రాస్ సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఏర్పేడు: స్థానిక హైస్కూల్‌లో ఆదివారం 2001–2002లో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం అట్టహాసంగా జరిగింది. వారు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువలతో సన్మానించి ఆశీర్వాదం పొందారు. వారు సేకరించిన విరాళాలతో పాఠశాల అభివృద్ధికి దోహద పడాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ భువనేశ్వరి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం


కాలిన ఇల్లు

రేణిగుంట: మండలకేంద్రంలో శనివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఓ ఇల్లు, అందులోని వస్తు సామగ్రి, కారు అగ్నికి ఆహుతైన ఘటన వెలుగు చూసింది. వివరాలు.. రేణిగుంట పాత చెక్ పోస్ట్ ప్రాంతంలో నివాసం ఉంటున్న జయకుమార్, భార్య సరస, కుమార్తె జాస్విన్ రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మంటలు వ్యాపిస్తున్న విషయం తెలిసి జయకుమార్ గట్టిగా కేకలు వేస్తూ భార్య, కుమార్తెను తీసుకుని బయటకు పరుగులు తీశారు. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని మంటలను అదుపుచేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే ఇల్లు, ఇంటి ఆవరణలో ఉన్న కారు, ఇంట్లోని వస్తు సామగ్రి, రూ.50 వేలు నగదు, బంగారు ఆభరణాలు, ఎలక్ట్రికల్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. కట్టు బట్టలతో వీధిన పడిన తమను ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది. కాగా అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని అనుమానిస్తున్నారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

కనుల పండువగా పార్వేటి ఉత్సవం


అలంకార మండపంలో స్వామి, అమ్మవారు


నవదుర్గల వేషధారణలో చిన్నారులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో గత పది రోజులుగా జరిగిన నవరాత్రి ఉత్సవాల్లో పదోరోజు శనివారం విజయదశమి పార్వేటి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. మొదట అమ్మవారిని అలంకార మండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి పంచహారతులు సమర్పించారు. అనంతరం ఆలయంలో ఊరేగించి కంచు గడపల వద్ద హారతుల సమర్పించారు. శివ గోపురం నుంచి జ్ఞాన ప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్లు పురవీధుల్లోకి ప్రవేశించారు. ఈ నగరోత్సవంలో 108 మంది చిన్నారులు నవదుర్గ అలంకరణలో స్వామి, అమ్మవారి ముందు నడుస్తూ పుర ప్రజలను అలరించారు. అలాగే కేరళ వాయిద్యం, డప్పు, మంగళ వాయిద్యాల నడుమ ఓం నమశ్శివాయ నామస్మరణ మధ్య పార్వేట ఉత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ ఆజాద్, ఆలయ అధికారులు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా దసరా ఉత్సవాలు ముగింపు

రేణిగుంట: మండలంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. గురవరాజు పల్లి పంచాయతీ రామకృష్ణాపురంలో వెలసిన శ్రీ అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు శనివారం దసరా పర్వదినాన రేణిగుంట లారీ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ ఉపాధ్యక్షుడు రాము, దేవి దంపతులు ఉభయదారులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకరణలో శ్రీ అంకాల పరమేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉభయదారులు, ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త కుప్రపాకు మునికృష్ణ, కమిటీ సభ్యులు, ఉభయదారులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కరకంబాడిలో వెలసిన కట్టపుట్టాలమ్మ ఆలయంలో ఆలయ ధర్మకర్త కుప్రకాల్వ రామచంద్రయ్య, కుప్రకాల్వ వాసు ఆధ్వర్యంలో, రేణిగుంటలోని గంగమ్మ ఆలయంలో ఆలయ చైర్మన్ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామదేవత వేమలమ్మ, పల్లమాల గ్రామదేవత పచ్చాలమ్మ, నీర్పాకోట గ్రామదేవత చెంగాళమ్మ అమ్మవారి ఆలయాల్లో గ్రామస్తులు గురువారం పూజలు చేశారు. బుచ్చినాయుడుకండ్రిగలో స్థిరపడిన రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన వ్యాపారులు మహిళలతో కలసి చేసిన దాండియా నృత్యం ఆకట్టుకుంది.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలవ్యాప్తంగా విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. మర్రిమంద మాతాశ్రీ ఆశ్రమంలో రాజరాజేశ్వరీ దేవిగా, చిందేపల్లిలో పార్వతీ దేవి, కోబాకలో పోలినాంచారమ్మ, పాపానాయుడుపేట భద్రకాళీ దేవి, గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని ఆనందవల్లీ దేవి, కందాడులో కామాక్షి దేవి అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.





రేణిగుంట: అలంకరణలో అంకాల పరమేశ్వరి అమ్మవారు, రేణిగుంట: కరకంబాడి కట్టపుట్టాలమ్మ ఆలయంలో ..., బీఎన్‌కండ్రిగ: అలంకరణలో వేమలమ్మ దేవత, ఏర్పేడు: మర్రిమంద మాతాశ్రీ ఆశ్రమంలో..